# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శనివారం-20- సెప్టెంబర్- 2025 | సంపుటి : 3 | సంచిక : 115 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అవినీతి పై కఠిన చర్యలు

**లంచగొండులపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్న మంత్రి పొంగులేటి**

హైదరాబాద్,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు)::

పేదల సొంతింటి కల నెరవేర్చే ప్రణాళికగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అవినీతి చోటు చేసుకుంటే ఎంతమందైనా కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు.గత వారం ప్రారంభించిన కాల్ సెంటర్‌కు అందిన ఫిర్యాదులపై మంత్రి శుక్రవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ విపి గౌతమ్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఎడిజీ సంగ్రామ్ సింగ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

మిగతా 2లో



## మహిళ సాధికారతకు పెద్దపీట

- కూకట్పల్లి మహిళా ప్రాంగణంలో నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం
- ఉచిత శిక్షణతో పాటు రవాణా సౌకర్యం కల్పన
- శిక్షణ పూర్తి చేసిన మహిళలకు వడ్డీ లేని రుణాలు అందజేయనున్న ప్రభుత్వం
- మహిళా సంఘాల ద్వారా కొత్త అవకాశాల సృష్టికి ప్రాధాన్యం

హైదరాబాద్,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):


హైదరాబాద్‌లోని కూకట్పల్లి దుర్గాబాయి మహిళా శిశు వికాస మహిళా ప్రాంగణంలో నూతన మహిళా ట్రైనింగ్ సెంటర్‌ను రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దానసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఉమెన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, మహిళా సంక్షేమ శాఖ సెక్రటరీ సీతారామచంద్రన్, ఉమెన్ కార్పొరేషన్ ఎండి చంద్రకాంత్ రెడ్డి, అల్విన్ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మిగతా 2లో



## రాజీనా...రాజీనామానా ? క్లారిటీ ఇవ్వని కడియం

- అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నడుస్తున్నా!
- స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటా
- బీఆర్ఎస్‌లోనే ఫిరాయింపులు ప్రోత్సహించారు
- కేసీఆర్ రాజకీయ వ్యవస్థను భ్రష్టుపట్టించారు
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



2లో




- పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు
- రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి విజన్ డాక్యుమెంట్– 2047 రూపకల్పన
- హైదరాబాదును గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే పలు ప్రణాళికలు
- సేంద్రియ పంటల ఉత్పత్తి, నైపుణ్యాభివృద్ధి, క్రీడా రంగంపై దృష్టి

2లో

### తెలంగాణను ప్రపంచలోనే అగ్రస్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా

# పెట్టుబడులకు ఆహ్వానం

## వరల్డ్ ఎకనమిక్ ఫోరం వార్షిక సదస్సుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం

- డబ్ల్యుఈఎఫ్ అధ్యక్షుడు, సీఈఓ బోర్గె బ్రెండీతో సీఎం రేవంత్ భేటీ
- జనవరిలో దావోస్ సదస్సుకు ముఖ్యమంత్రికి ఆహ్వానం
- తెలంగాణ అభివృద్ధి పట్ల వరల్డ్ ఎకనమిక్ ఫోరం ప్రశంసలు
- తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు సంపూర్ణ మద్దతు హామీ

2లో





## తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు అమెజాన్ మూడు కొత్త కార్యక్రమాలు

2లో

**ఎస్ఎంఈ ఎగుమతులు, మహిళా సాధికారత, గిగ్ వర్కర్ల సంక్షేమంపై దృష్టి**

## అమెరికా న్యూజెర్సీ గవర్నర్ ఫిలిప్ మర్ఫీతో సిఎం రేవంత్ రెడ్డి భేటీ



- ఢిల్లీలో సీఎం,న్యూజెర్సీ గవర్నర్ సమావేశం
- విద్య, గ్రీన్ ఎనర్జీ, సినిమా రంగంపై చర్చలు
- తెలంగాణ రైజింగ్ 2047' విజన్ వివరించిన ముఖ్యమంత్రి
- మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్, మౌలిక సదుపాయాల అభివృద్ధి అంశాలు ప్రస్తావన

న్యూ ఢిల్లీ,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అమెరికా న్యూజెర్సీ గవర్నర్ ఫిలిప్ డి. మర్ఫీతో ఢిల్లీలో సమావేశమయ్యారు. ఇరువురి మధ్య జరిగిన ఈ భేటీలో విద్య, గ్రీన్ ఎనర్జీ, వినోద పరిశ్రమ, ముఖ్యంగా సినిమా రంగం, అలాగే మెట్రో, పట్టణ రవాణా వ్యవస్థలు, మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్ వంటి కీలక అంశాలపై చర్చలు సాగాయి. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను సాధించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

మిగతా 2లో

## దళితుల అభ్యున్నతికి కట్టుబడి ఉంటా

- మంత్రి వివేక్ వెంకటస్వామి
- దళితుల హక్కుల సాధనకే ప్రధాన లక్ష్యం
- బడ్జెట్‌లో 18 శాతం నిధులు కేటాయిస్తే సమస్యలకు పరిష్కారం
- ఆర్థిక ఇబ్బందులున్నా దళితుల సమస్యలు తప్పక పరిష్కరిస్తాం
- రైతు బంధు అమలులో అన్యాయం జరగకుండా జాగ్రత్తలు



హైదరాబాద్,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):

దళితుల అభ్యున్నతే తన సంకల్పమని, వారి హక్కుల సాధనకే తన కృషి కొనసాగుతుందని కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన దళిత జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నుండి వచ్చిన దళిత జర్నలిస్టులను కలుసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు.

ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, దళిత సోదరుల హక్కుల సాధనే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

మిగతా 2లో

## నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్

**శాశ్వత పరిష్కారం చూపాలంటూ ఆదేశం**

హైదరాబాద్,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):

నగరంలో నీట మునిగిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు గురువారం పరిశీలించారు. అమీర్‌పేటలోని గాయత్రి కాలనీ, మాధాపూర్‌లోని అమర్ సొసైటీ, బాగ్‌లింగంపల్లి లోని శ్రీ రాంనగర్‌లలో హైడ్రా కమిషనర్ పర్యటించారు. అమీర్‌పేట వద్ద కాలువల్లో పూడిక తీయడంతో సాఫీగా వరద సాగుతోందని ఇదే మాదిరి నగరంలోని అన్ని చోట్ల నీటి మునకకు మూలాలను తెలుసుకుని సమస్య పరిష్కరించాలని హైడ్రా కమిషనర్ సూచించారు. పై నుంచి భారీ మొత్తంలో వస్తున్న వరద నీరు మైత్రి వనం వెనుక ఉన్న గాయత్రినగర్‌ను ముంచెత్తుతోందని.. ఇక్కడ కూడా కాలువలలో సిల్ట్ తొలగించి వరద ముప్పు సమస్యతను తొలగించాలని అక్కడి నివాసితులు కమిషనర్‌ను కోరారు.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు అమెజాన్ మూడు కొత్త కార్యక్రమాలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అమెజాన్ ఇండియా మూడు ప్రధాన కార్యక్రమాలను ప్రకటించింది. రాష్ట్రంలో కార్యకలాపాలను విస్తరించడంతో పాటు వివిధ వర్గాలకు మద్దతు ఇవ్వడమే వీటి లక్ష్యమని సంస్థ వెల్లడించింది.

న్యూఢిల్లీలో జరిగిన పీఏఎఫ్ఐ వార్షిక సదస్సులో ప్రసంగించిన అనంతరం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పలు కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. కొత్త పెట్టుబడులను అన్వేషించడంతో పాటు ఇప్పటికే ఉన్న కార్యకలాపాలను విస్తరించాలని సూచించారు. ఈ సందర్భంలో అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (పబ్లిక్ పాలసీ) చేతన్ కృష్ణతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. అమెరికా వెలుపల అమెజాన్‌కు అతిపెద్ద గ్లోబల్ కేంద్రాలలో తెలంగాణ ఒకటని గుర్తు చేస్తూ, సంస్థ రాష్ట్రంతో తన నిబద్ధతను పునరుద్ఘాటించింది.

**అమెజాన్ ప్రకటించిన మూడు కార్యక్రమాలు:**

- ఎస్ఎంఈ ఎగుమతిదారులకు మద్దతు: గ్లోబల్ ప్లాట్‌ఫామ్ ద్వారా తెలంగాణలోని చిన్న, మధ్య తరహా వ్యాపార విక్రేతలను ప్రోత్సహించడం. దీని ద్వారా ఎగుమతులు పెరిగి వ్యాపార విస్తరణకు అవకాశాలు లభిస్తాయి.
- మహిళా పారిశ్రామికవేత్తలకు సాధికారత: కళాకార్ కార్యక్రమం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించే అవకాశం పొందుతారు.
- గిగ్ వర్కర్ల సంక్షేమం: తెలంగాణ ప్రభుత్వంతో కలిసి హైదరాబాద్‌లో 100 విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. వీటిలో అన్ని ప్లాట్‌ఫామ్‌ల గిగ్ వర్కర్లకు పార్కింగ్, మొబైల్ ఛార్జింగ్ స్టేషన్లు, ఎయిర్ కండిషన్డ్ విశ్రాంతి గదులు వంటి సౌకర్యాలు లభిస్తాయి.

## వరల్డ్ ఎకనమిక్ ఫోరం వార్షిక సదస్సుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం

**న్యూ ఢిల్లీ,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):**



న్యూ ఢిల్లీలో జరిగిన పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా వార్షిక సదస్సులో ప్రసంగించిన అనంతరం తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వరల్డ్ ఎకనమిక్ ఫోరం అధ్యక్షుడు, సీఈఓ బోర్గె బ్రెండీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బ్రెండీ, వచ్చే ఏడాది జనవరిలో దావోస్‌లో జరగనున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం వార్షిక సదస్సులో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. త్వరలో హైదరాబాద్ పర్యటనకు వస్తానని, రాష్ట్రంతో సహకారం కోసం మరిన్ని అవకాశాలను పరిశీలిస్తానని ఆయన తెలిపారు. "గత ఏడాది కాలంలో తెలంగాణ అసాధారణ పురోగతి సాధించింది. భారతదేశంలో అత్యంత విజయవంతమైన రాష్ట్రాలలో ఒకటిగా ఎదుగుతోంది. దీని వెనుక రహస్యమేంటి?" అని బ్రెండీ ప్రశ్నించగా, "కష్టపడి పని చేయడం, అందరి మద్దతే విజయానికి మూలం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానమిచ్చారు. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను అభినందిస్తూ, వరల్డ్ ఎకనమిక్ ఫోరం తరపున సంపూర్ణ మద్దతు అందిస్తామని బ్రెండీ హామీ ఇచ్చారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అవినీతి పై కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)



సమీక్షలో మధిరాల మండలం పోలుమల్ల గ్రామంలో 10 వేల రూపాయల లంచం డిమాండ్ చేసిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సత్తెయ్యను పదవి నుండి తొలగించాలని, క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. జంగాం జిల్లా పడమటి తండాలో 30 వేల రూపాయల డిమాండ్ అంశంపై పూర్తి స్థాయి విచారణ జరిపి 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు.

అదేవిధంగా ఖమ్మం, జగిత్యాల, కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇండ్లు ఇవ్వక ముందే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన నాలుగు గ్రామపంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే నిధులను పాత బకాయిల కోసం వాడుతున్న బ్యాంకులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

లబ్ధిదారుల ఆధార్, బ్యాంకు వివరాల్లో తప్పులు ఉంటే త్వరగా సరిచేసుకోవాలని, దీని కోసం ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. వచ్చే పండుగలోపు అందరికీ చెల్లింపులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. "ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో లంచం కోసం ఎవరు వేధించినా 24 గంటల్లో క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. లబ్ధిదారులు 18005995991 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే తక్షణం చర్య తీసుకుంటాం" అని మంత్రి భరోసా ఇచ్చారు.

## దళితుల అభ్యున్నతికి కట్టుబడి ఉంటా

(మొదటి పేజీ తరువాయి)




అసెంబ్లీ సమావేశాల్లో ఇప్పటికే దళితుల సమస్యలపై చర్చ జరిగిందని గుర్తుచేశారు. బడ్జెట్‌లో 18 శాతం నిధులు కేటాయిస్తే దళిత సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టాల్లో ఉన్నప్పటికీ, దళితుల సమస్యలను తప్పక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

"మీ సమస్యలను నేను స్వయంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా" అని భరోసా ఇచ్చిన ఆయన, దళితుల అభ్యున్నతికి తన తండ్రి కాకా వెంకటస్వామి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. "ఆ మార్గంలోనే నేను నడుస్తూ దళితుల అభివృద్ధికి కట్టుబడి ఉంటా" అని ప్రకటించారు.

రైతు బంధు పథకం అమలు సమయంలో దళితుల భూముల విషయంలో ఎటువంటి అన్యాయం జరగకూడదని తమ కుటుంబం అప్పటినుంచే స్పష్టమైన అభిప్రాయం వ్యక్తం చేసిందని గుర్తుచేశారు. "దళితుల కోసం ఎల్లప్పుడూ మీతోనే ఉంటా, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తా" అని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు.

## నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్

(మొదటి పేజీ తరువాయి)



పై నుంచి నాలాల్లో పూడిక తీసుకుని వస్తున్నామని.. ఇక్కడ కూడా పరిష్కార చర్యలు తీసుకుంటామని కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు హామీ ఇచ్చారు.

**దుర్గం చెరువులో నీటిమట్టం తగ్గించాలి..**

దుర్గం చెరువులో నీటి మట్టం పెరగడంతో పై భాగంలో ఉన్న అమర్ సొసైటీతో పాటు అనేక కాలనీలుకు వరదనీరు పోటెత్తుతోందని స్థానికులు కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారికి తెలిపారు. చెరువు నీటి మట్టం తగ్గిస్తే కొంతవరకు సమస్య పరిష్కారమౌతుందని సూచించారు. ఈ విషయమై ఇరిగేషన్, జీహెచ్ ఎంసీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. క్లౌడ్ బరస్ట్ తో అనూహ్యంగా గంట వ్యవధిలోనే 15 సెంటీమీటర్లకు పైగా వర్షం పడడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని.. ఆ పరిస్థితులను తట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కమిషనర్ సూచించారు.

**`శ్రీరాంనగర్ సమస్యకు రెండు రోజుల్లో పరిష్కారం..**

బాగ్‌లింగంపల్లిలోని శ్రీరాంనగర్లో వరద నీరు పోయేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు సూచించారు. ఇందుకు గాను శ్రీరాంనగర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరద కాలువలో కలిసేలా ప్రత్యేక నాలాను నిర్మించాలన్నారు. నేరుగా హుస్సేన్ సాగర్ వరద కాలువలో కలపకుండా.. కొంతదూరం కొనసాగించి నాలాను కలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు రోజుల్లో ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో ఉన్న నాలాను బంద్ చేసి.. అక్కడ ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కబ్జా చేస్తున్నారని.. ఆ నాలాను పునరుద్ధరిస్తే వెంటనే సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు కమిషనర్‌కు తెలిపారు. శ్రీరాంనగర్‌లో వందలాది గృహాలకు దారి లేకుండా పోయిందని నడుం లోతు నీటిలో ఇళ్లకు ఎలా వెళ్లేదని స్థానికులు కమిషనర్ ముందు వాపోయారు. మోటార్లు పెట్టి తోడుతున్నా సమస్య పరిష్కారం కావడంలేదని.. ఇక్కడ ఉన్న ఖాళీ స్థలంలోంచి నాలాను తీసుకెళ్లి హుస్సేన్‌సాగర్ వరద కాలువలోకలిపాలని కోరారు.

# తెలంగాణను ప్రపంచలోనే అగ్రస్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా పెట్టుబడులకు ఆహ్వానం

**న్యూఢిల్లీ,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):**




ప్రపంచంలో అగ్రభాగాన నిలపాలన్న బృహత్తరమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలుస్తుందని, అవసరమైన భద్రత కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ప్రతిష్టాత్మక పబ్లిక్ ఎఫైర్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగించారు. అన్ని రంగాల్లో ప్రగతి సాధించేందుకు రూపొందించిన తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ను ఈ ఏడాది డిసెంబర్ 9న ఆవిష్కరించనున్నట్లు ప్రకటించారు. పారదర్శక పరిపాలనకు అవసరమైన రాజకీయ సంకల్పం తమ ప్రభుత్వానికి ఉందని, భవిష్యత్ తరాలకు అవకాశాలు సృష్టించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని కోర్ అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాలుగా విభజించినట్టు వివరించారు. కోర్ అర్బన్ ప్రాంతాల్లో కాలుష్యకారక పరిశ్రమలను నగరం వెలుపలకు తరలిస్తున్నామని, సెమీ అర్బన్ ప్రాంతాన్ని తయారీ పరిశ్రమల కోసం ప్రత్యేక జోన్‌గా నిర్ణయించినట్టు తెలిపారు. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల విస్తరణపై ప్రభుత్వం కృషి చేస్తోందని, మెట్రో రైలును 150 కి.మీ వరకు పొడిగించే ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. మూసీ నదిని పునరుజ్జీవింపజేసి సబర్మతి తీరంలా అభివృద్ధి చేస్తామని, ఎలివేటెడ్ కారిడార్లు, రీజినల్ రింగ్ రోడ్, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు తెలంగాణ భవిష్యత్ అవసరాలను తీర్చనున్నాయని స్పష్టం చేశారు.

విమానాశ్రయం నుంచి భారత్ ఫ్యూచర్ సిటీకి అనుసంధానం కల్పించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో సేంద్రియ పంటల ఉత్పత్తి పెరుగుతోందని, మాదక ద్రవ్యాల నిర్మూలనలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని గర్వంగా పేర్కొన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, క్రీడా ప్రతిభను పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని తెలిపారు.

ఓడరేవు లేని రాష్ట్రంగా తెలంగాణను మచిలీపట్నం ఓడరేవుతో అనుసంధానించేందుకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, సమాంతర రైల్వే మార్గం నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో 40 శాతం, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్ దేశంలో ముందువరుసలో ఉందని గుర్తు చేశారు.

ఈ సదస్సులో పీఏఎఫ్ఐ అధ్యక్షుడు చేతన్ కృష్ణ, సెల్ కాన్ గ్రూప్ చైర్మన్ గురుస్వామి నాయుడు, గోద్రేజ్ కార్పొరేట్ ఎఫైర్స్ గ్రూప్ అధ్యక్షుడు రాకేష్ స్వామి పాల్గొన్నారు. బిజినెస్ స్టాండర్డ్ సంపాదకీయ డైరెక్టర్ అశోక్ భట్టాచార్య సమావేశానికి మోడరేటర్‌గా వ్యవహరించారు.

## అమెరికా న్యూజెర్సీ గవర్నర్ ఫిలిప్ మర్ఫీతో సిఎం రేవంత్ రెడ్డి భేటీ

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్ర వ్యూహాత్మక ప్రాధాన్యతల్లో ఐటీ, ఔషధ రంగాలకు ఉన్న స్థానం గురించి ప్రస్తావించారు .ఈ సమావేశంలో న్యూజెర్సీ ప్రథమ మహిళ టామీ మర్ఫీతో పాటు న్యూజెర్సీ రాష్ట్ర ప్రతినిధులు, తెలంగాణ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మహిళ సాధికారతకు పెద్దపీట


(మొదటి పేజీ తరువాయి)

లైట్ హౌస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ శిక్షణ కేంద్రంలో గృహిణుల కోసం కంప్యూటర్ కోర్సులు, కుట్టుమిషన్ శిక్షణ, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, ఉపాధి కల్పన తరగతులు, మాట్లాడే ఆంగ్లభాష వంటి పలు కార్యక్రమాలు అందిస్తున్నారు. అలాగే,మొవో సంస్థ ఆధ్వర్యంలో టు వీలర్, త్రీ వీలర్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "ప్రతి మహిళ మహారాణి కావాలంటే ఆర్థిక స్వావలంబన అవసరం. చేతిలో డబ్బు ఉన్నప్పుడే మహిళలకు గౌరవం, స్వేచ్ఛ లభిస్తుంది. కుటుంబాభివృద్ధి, పిల్లలకు మంచి విద్య కల్పించాలంటే మహిళలు ఆర్థికంగా బలపడాలి" అని అన్నారు. శిక్షణతో పాటు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, దీన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళల గ్రీన్ ఆటోలను జెండా ఊపి ప్రారంభించిన ఆమె, శిక్షణ అనంతరం వడ్డీ లేని రుణాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, ఆర్టీసీ సేవల నిర్వహణ వంటి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని సీతక్క తెలిపారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ, "మహిళ సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని ఐటి సంస్థల సిఎస్ఆర్ నిధులను మహిళా శిక్షణ కార్యక్రమాలకు వినియోగించేలా చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలు కుట్టే అవకాశాన్ని కూకట్పల్లి మహిళా ప్రాంగణానికి అప్పగిస్తాం" అని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ఉచిత శిక్షణ సౌకర్యాలను అందిస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## రాజీనా...రాజీనామానా ? క్లారిటీ ఇవ్వని కడియం

**హనుమకొండ,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):**



స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం హనుమకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో 36 మంది శాసన సభ్యులను పార్టీలో చేర్చుకొని, వారిలో ఇద్దరికి మంత్రి పదవులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధి, నియోజకవర్గ ప్రగతి కోసం అధికారంలో ఉన్న పార్టీతోనే నడవాలని స్పష్టంచేశారు. గత పదిహేనేళ్లుగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు కాంగ్రెస్‌తో పని చేస్తున్నానని తెలిపారు.

కేసీఆర్ రాజకీయ వ్యవస్థను భ్రష్టుపట్టించారని తీవ్రస్థాయిలో విమర్శించిన కడియం, అధికారంలో ఉన్నప్పుడు ఆయనే ఫిరాయింపులను ప్రోత్సహించారని, ఎవరినీ రాజీనామా చేయనివ్వలేదని గుర్తుచేశారు. "మీరు చేస్తే సంసారం, మరొకరు చేస్తే వ్యభిచారమా?" అంటూ ఘాటుగా స్పందించారు. అధికారం కోల్పోయిన తర్వాత ఫాం హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ ఇప్పుడు రాజకీయాలు గుర్తు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు విషయాన్నీ ప్రస్తావించిన కడియం, పార్టీ మారారని కోర్టు సభ్యత్వం రద్దు చేయమని చెప్పలేదని, అది పూర్తిగా స్పీకర్ పరిధిలోనే ఉందని వివరించారు. స్పీకర్ ఇచ్చిన నోటీసుకు సమాధానం ఇవ్వడానికి సమయం ఉందని, ఏదీ ఏమైనా స్పీకర్ నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

ఫిరాయింపులను వ్యక్తిగతంగా వ్యతిరేకిస్తున్నానని, కానీ నియోజకవర్గ ప్రజల ప్రయోజనం కోసం తప్పని పరిస్థితుల్లోనే పార్టీ మారాల్సి వస్తుందని పేర్కొన్నారు. "నాకు కూడా బూతులు వచ్చు, మాటలు వచ్చు. కానీ నేను మాట్లాడేందుకు సంస్కారం అడ్డు వస్తోంది" అని వ్యాఖ్యానించారు. వ్యక్తిగత విమర్శలు చేయడం సరైంది కాదని రాజయ్యను ఉద్దేశించి చురకలంటించారు. నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడుతూ, దేవాదుల ఉపకాల్వల కోసం 148 కోట్లు మంజూరయ్యాయని, గోదావరి జలాలతో చివరి ఆయకట్టు వరకు నీళ్లు వెళ్తాయని తెలిపారు. సవరించిన రూ.1015 కోట్లతో ప్యాకేజీ6లో రిజర్వాయర్లు, చెరువులు నింపుతున్నామని వివరించారు. స్టేషన్‌ను విద్యా కేంద్రంగా మార్చేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేయించామని కడియం శ్రీహరి పేర్కొన్నారు.మొత్తానికి రాజీనా...రాజీనామానా? అనే విషయంపై కడియం క్లారిటీ ఇవ్వలేదని సమాధానం దాటవేస్తున్నారని జిల్లాలో గుసగుసలు వినిపిస్తున్నాయి.



## సొసైటీ సీఈఓకి ఘన వీడ్కోలు

**సత్తుపల్లి, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):**సత్తుపల్లి మండలం, గంగారం గ్రామంలో పి.ఏ.సి.ఎస్ సొసైటీ సీఈఓగా దాదాపు 37 ఏళ్లపాటు రైతులకు అంకిత భావంతో సేవలందించిన చీపు వీరస్వామికి శుక్రవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల జరిగిన బదిలీల కారణంగా ఆయన ఇకపై సత్తుపల్లి సొసైటీ బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో రైతులు, సూపర్ స్టార్ కృష్ణ-మహేష్ అభిమానులు కలిసి ఆయనకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ,రైతుల్లో ఒకరిగా మాతో కలిసిపోతూ, ఎప్పటికప్పుడు సహాయం చేసిన వీరస్వామి సేవలు మరువలేనివి. ఆయన మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరుకుంటున్నాం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్ స్టార్ కృష్ణ మహేష్ ఫాన్స్ డివిజన్ అధ్యక్షులు కోటమర్తి వెంకటేశ్వరరావు, చల్లారి సత్యనారాయణ, బండారి మారేశ్వరరావు, ఊకే కన్నారావు, గండ్ర లోకేష్ రెడ్డి, మందపాటి నర్సారెడ్డి, మందపాటి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## డిజిల్ లోకో షెడ్ ముందు ధర్నా

**కాజీపేట్ సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కాజీపేటలోని డిజిల్ లోకో షెడ్ ముందు శుక్రవారం నాయకులు ధర్నా నిర్వహించారు. ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్ అండ్ సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా నిర్వహించే ధర్నాల్లో భాగంగా పెద్ద ఎత్తున డీజిల్ లోకో షెడ్ ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ అధ్యక్షులు కామ్రేడ్ ఎస్కే. జానీ మియా బ్రాంచ్ కార్యదర్శి పాక వేద ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు, ఏఐఆర్ఎఫ్ ఉపాధ్యక్షుడు కామ్రేడ్ కాల్వ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ ఎనిమిదవ వేతన సంఘం అమలును వెంటనే చేయాలని అన్నారు. విలువలతో కూడిన వేతన సంఘాన్ని వెంటనే ప్రకటించి జనవరి20 26 సంవత్సరం నుండి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎనిమిదవ వేతన సంఘాన్ని త్వరగా అమలు చేయకుంటే భవిష్యత్తులో కార్యాచరణలో కార్మికులు దేనికైనా సిద్ధంగా ఉంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ట్రెజరర్ గిరిమిట్ల రాజేశ్వరరావు, ఆఫీస్ బేరర్ భాస్కర్ రెడ్డి, నాగరాజు, యాదగిరి, సత్యనారాయణ, యాదగిరి, నరేష్ యాదవ్, శ్రీనివాస్, గాంధీ ,పాక రవి, రజాక్, వి శ్రీనివాస్ డీజిల్ ఇన్స్టిట్యూట్ కమిటీ మెంబర్స్ అంతయ్య, రాముల సదానందం ,శివకుమార్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.



## జీతాలు లేక ఇబ్బందులు మిడ్డే మీల్స్ వర్కర్లు.!

**ఆరు నెలలుగా వేతనాలు బాకీ**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** మధ్యాహ్నం భోజన పథకంలో పనిచేస్తున్న వర్కర్లు గత ఆరు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బిల్లులు వేయకపోవడం వల్ల తమకు వేతనాలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పచారీ సామాన్లు, కూరగాయలు, గుడ్లు షాపుల వారు కూడా ఇకపై అరువు ఇవ్వడం మానేశారని, తాము అప్పు తెచ్చి పిల్లలకు భోజనం పెట్టాల్సి వస్తోందని వాపోయారు. "మేమంతా బీద, మధ్యతరగతి వారమే. కట్టెల పొయ్యిపై వంట చేస్తే పొగ కళ్లల్లోకి పోయి కంటి సమస్యలు వస్తున్నాయి. ప్రభుత్వం గ్యాస్ పొయ్యి, సిలిండర్లు ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు ఇవ్వలేదు" అని వర్కర్లు పేర్కొన్నారు.

ప్రభుత్వం నెలకు మూడు వేలు జీతం ఇస్తామని హామీ ఇచ్చినా కనీసం వెయ్యి రూపాయలు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వేతనాలు చెల్లించడంతో పాటు ప్రతి నెలా బిల్లులు సక్రమంగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని విన్నవించారు.

ఈ సమస్యపై మండల విద్యా అధికారిని కలిసి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వర్కర్లు కోరుతున్నారు.






## కాజీపేట ఆర్ఓబి పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**కాజీపేట,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** కాజీపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి) పనులను వరంగల్ పశ్చిమ నియోజక వర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇప్పటికే మొదటి వంతెన పనులు పూర్తయ్యాయని, రెండో వంతెన నిర్మాణం కొంత మేరకు పురోగమించిందని తెలిపారు. రైల్వే అధికారుల సూచనల మేరకు ఇనుప వంతెన నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలకు రవాణా సౌకర్యాలు కల్పించడమే కాకుండా, ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు రెండో వంతెన పనులకు వేగం చేకూర్చాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పనుల్లో ఎటువంటి ఆలస్యం జరగకుండా, అనవసర జాప్యాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా, పాత వంతెన మరమ్మత్తుల కోసం ప్రభుత్వం రూ.59 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించి వంతెనను మరింత సురక్షితంగా, వినియోగయోగ్యంగా మార్చాలని ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.తరువాత ఆయన స్థానిక ప్రజలు, సాంకేతిక అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పాత వంతెన వద్ద మరమ్మత్తు పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## మాదిగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సుంకే ప్రభాకర్ నియామకం

**హైదరాబాద్,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** మాదిగ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పిఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సుంకే ప్రభాకర్‌ను నియమించారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ స్వయంగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మైస ఉపేందర్ మాట్లాడుతూ, మాదిగ సమాజ హక్కుల సాధనలో ప్రభాకర్ అంకితభావం, కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. సమాజ బలోపేతం కోసం ఆయన చేసిన కృషిని గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలను అప్పగించినట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సమితి సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజల్లో విస్తరించి, సమాజ అభివృద్ధికి ప్రభాకర్ కీలకంగా మారుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయిలో సమితి కార్యకలాపాలను మరింత బలపరచడమే ఈ నియామక ప్రధాన ఉద్దేశమని ఉపేందర్ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సుంకే ప్రభాకర్ మాట్లాడుతూ, సమాజం తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని, సమితి సిద్ధాంతాలు, లక్ష్యాలను గ్రామాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు విస్తరించి, మాదిగ సమాజ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకాన్ని మరింత బాధ్యతగా భావించి, సమాజ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడతానని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధ్యక్షులు కత్తి విష్ణు,ప్రధాన కార్యదర్శి దాసరి శివ తదితరులు పాల్గొన్నారు.





## కిష్టారం అభివృద్ధి పనుల తనిఖీ
## ద్వారకాపూరి సమస్యలపై స్పందన!

**సత్తుపల్లి, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, ప్రజల సమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ శుక్రవారం పర్యటించారు. ఉదయం కిష్టారం గ్రామం, మధ్యాహ్నం సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపూరి కాలనీలో పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. కిష్టారం ప్రభుత్వ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న ఆడిటోరియం, తరగతి గదుల పనులను పరిశీలించిన ఆయన, బీసీ హాస్టల్‌లో మధ్యాహ్న భోజన వంటను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని మరింత బలోపేతం చేస్తోంది, దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచి ఉపాధ్యాయులకు ఊరట కల్పించిన ఘనత మా ప్రభుత్వానిదే, పాఠశాలలు ప్రారంభమైన వెంటనే పుస్తకాలు, యూనిఫామ్‌లు అందించే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్‌దే అని పేర్కొన్నారు. తరువాత ఆయన ద్వారకాపూరి కాలనీకి చేరుకుని ప్రజలతో సమావేశమయ్యారు. గత బీఆర్ఎస్ మున్సిపల్ పాలనలో పరిష్కారం కాని సమస్యలు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని గుర్తించి, త్వరలోనే పట్టణంలోని అన్ని వార్డుల్లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల వద్ద ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్ సమస్యపై విద్యుత్ అధికారులతో చర్చించారు, అలాగే డ్రైనేజీ, పరిశుభ్రత, కరెంట్ స్తంభాల సమస్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సత్తుపల్లి పట్టణంలో గృహస్థలాలు లేని నిరుపేదలకు ఇళ్లు కల్పించడం, సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా చూడడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సిపిఐ సీనియర్ నాయకుడు దండు ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకులు ఉడతనేని అప్పారావు, నరకుల్ల అప్పారావు, రవికుమార్, గఫార్, మాజీ కౌన్సిలర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, పట్టణగ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

**కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్**

**చిల్కానగర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గంలోని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ వర్షాకాలంలో ప్రజారోగ్యం దృష్ట్యా చర్యలు చేపట్టారు. శుక్రవారం ఆమె జిహెచ్ఎంసి ఎంటమాలజీ డిపార్ట్మెంట్ అధికారులతో కలిసి పలు కాలనీలు, బస్తీలలో దోమల నివారణ రసాయనాల పిచికారీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, "డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు నివారణలో ప్రజల సహకారం ఎంతో అవసరం. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల చుట్టు పక్కల నిల్వ నీరు లేకుండా చూసుకోవాలి. పరిసరాలు శుభ్రంగా ఉండడం మన అందరి బాధ్యత. ప్రభుత్వం, జిహెచ్ఎంసి సిబ్బంది మాత్రమే కాదని, ప్రజలు కూడా ముందుకు వచ్చి భాగస్వామ్యం కావాలి," అని పిలుపునిచ్చారు.అదేవిధంగా, ఎంటమాలజీ విభాగం సిబ్బంది స్థానికంగా నీటి నిల్వలున్న ప్రదేశాలను గుర్తించి, డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందకుండా క్రమం తప్పకుండా పిచికారీ చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. "ప్రజల ఆరోగ్యం కాపాడటంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదు" అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో ఏఈ నరేష్ రెడ్డి, సూపర్వైజర్ అజయ్, ఎంటమాలజీ విభాగ సిబ్బంది పాల్గొని ప్రాంతాల వారీగా శుభ్రత, పిచికారీ పనులను పర్యవేక్షించారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# కేయూ బాలికల ఇంజనీరింగ్ కాలేజ్ బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎంపి కావ్య

**హన్మకొండ,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** కాకతీయ యూనివర్సిటీ బాలికల ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య విద్యార్థినిలతో కలిసి బతుకమ్మ ఆడుతూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కావ్య మాట్లాడుతూ, పువ్వులను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ప్రపంచంలో ఆడబిడ్డలు పువ్వులను పూజించే ప్రత్యేక సంస్కృతి తెలంగాణలోనే ఉందని గుర్తుచేశారు. రాణి రుద్రమదేవి, సమ్మక్క-సారక్క, చాకలి ఐలమ్మ వంటి మహనీయుల ధైర్యసాహసాలు ఓరుగల్లు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని తెలిపారు. విద్యార్థినులు అనుకున్నది సాధించాలంటే క్రమశిక్షణతో కష్టపడి చదవాలని, అప్పుడు మాత్రమే విజయం సాధ్యమవుతుందని ప్రోత్సహించారు. సోషల్ మీడియా వినియోగంలో, కొత్తగా వస్తున్న ఏఐ టెక్నాలజీల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






# మిస్టర్ ఇండియా ఇంటర్నేషనల్ 2025 టైటిల్ విన్నర్ డాక్టర్ గంగి మల్లేష్

**మేడ్చల్ మల్కాజ్గిరి, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** సమాజ సేవకే ప్రతిఫలంగా గుర్తింపులు వస్తాయని మరోసారి రుజువైంది. గోల్డెనైర్ అల్ సేవా ఫౌండేషన్, మోర్డ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ ఫ్యూచర్ గ్లోబల్ సేవ ఫౌండేషన్ - ఇన్పాక్ట్ 2025 ఇంటర్నేషనల్ ఫ్యాషన్ & టాలెంట్ అవార్డ్స్లో రాంపల్లి దయారా మాజీ సర్పంచ్ డాక్టర్ గంగి మల్లేష్ "మిస్టర్ ఇండియా ఇంటర్నేషనల్ 2025" టైటిల్‌ను అందుకున్నారు.ఈ అవార్డును ప్రముఖులు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ శ్రీనివాస్, సినీ నటీమణి రాగిణి, మలబార్ గోల్డ్ మోడల్ & మిస్సెస్ యూనివర్సల్ 2022 డాక్టర్

## ప్రజా సేవకే అవార్డుల రూపంలో గుర్తింపు

సుజనా, సినీ నటీమణి హీనా, హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు డీసీపీ రామదాస్ తేజావత్ తదితరుల చేతుల మీదుగా ప్రదానం చేశారు.ప్రజాసేవే తన లక్ష్యం: డాక్టర్ గంగి మల్లేష్ మాట్లాడుతూ - "అవార్డులు అనేవి వ్యక్తిగత కీర్తి కోసం కాకుండా, ప్రజా సేవా మార్గంలో నడిచిన వారికి గుర్తింపుగా వస్తాయి. పేద ప్రజల కోసం నిరంతరం సేవ చేస్తూ ముందుకు సాగుతానని" ఆయన అన్నారు.ఇప్పటికే ఆయన భరత్ విభూషణ అవార్డు 2024, స్ఫూర్తి బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వంటి అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నారు. సమాజ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సేవ చేసే వ్యక్తులను గుర్తించడమే ఈ అవార్డుల ఉద్దేశమని స్పష్టం చేశారు. అలుపెరుగని సేవా దృక్పథం ప్రజల కోసం నిరంతరం అలుపెరుగని పోరాటం చేస్తూ, అవసరమైన వారికి వైద్య సదుపాయాలు అందించడం, ఎమర్జెన్సీ సమయంలో తన సొంత వాహనాన్నే అంబులెన్స్‌లా ఉపయోగించి రోగులను ఆస్పత్రులకు చేర్చడం వంటి సేవలు డాక్టర్ గంగి మల్లేష్ ప్రత్యేకతగా నిలిచాయి. పలువురు సామాజికవేత్తలు మాట్లాడుతూ - "సేవా దృక్పథం అంటే ఇదే. సమాజంలో జరిగే కష్టాలను అర్థం చేసుకొని, నిరుపేదలకు అండగా నిలబడే గంగి మల్లేష్ వంటి వ్యక్తులు నేటి యువతకు ఆదర్శం. ఆయనకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో అవార్డులు రావాలి" అని అభిలషించారు. ఘనంగా పాల్గొన్న స్వచ్ఛంద సంస్థలుఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల కోసం, సమాజాభివృద్ధి కోసం పని చేస్తున్న పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక సేవకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని గంగి మల్లేష్ సేవలను అభినందించారు.







# నిరాదరణ కలిగిన బాలలకు విద్య అందించుట అందరి బాధ్యత

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**హన్మకొండ,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** నిరాదరణలో ఉన్న పిల్లలకు విద్యా సదుపాయాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ ఎనుమాముల ఎన్టీఆర్‌నగర్‌లోని మండల ప్రాథమిక పాఠశాలలో ఆపరేషన్ ముష్కాన్ కార్యక్రమం కింద గుర్తించిన వలస బాలలకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఆపరేషన్ ముష్కాన్ ద్వారా బడి బయట ఉన్న పిల్లలు, బాల కార్మికులు, నిరాదరణలో ఉన్న చిన్నారులను గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించడం జరుగుతుందని తెలిపారు. అయితే పూర్తిస్థాయి పునరావాసం కోసం విద్య అత్యంత కీలకమని, ఆ దిశగా బీహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి వలస వచ్చిన 62 మందిని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో చేర్పించినట్లు వెల్లడించారు. పిల్లలతో మాట్లాడుతూ, ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని చదువు ద్వారా వాటిని సాధించాలని సూచించారు. చిన్నారులను పనిలో పెట్టే తల్లిదండ్రులు, వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ మాట్లాడుతూ, పోలీస్ కమిషనరేట్ పరిధిలో చేపట్టిన ఈ చొరవ రాష్ట్రంలోనే తొలిసారిగా అమలవుతోందని, వర్క్‌సైట్ల వద్ద ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. సామాజిక సేవా సంస్థ సహకారంతో పిల్లలకు ఉచితంగా బ్యాగులు, పుస్తకాలు, అవసరమైన సామాగ్రి అందజేశారు. డాన్ బాస్కో సంస్థ సహకారంతో ప్రత్యేకంగా ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి పిల్లలకు బోధన ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేష్, ఎస్హెచ్ఓ సురేష్‌కుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్పర్సన్ వసుధ, డాన్ బాస్కో ప్రతినిధులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అధికారులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ అంబాత్త్రయ క్షేత్రంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

## భక్తుడు గుండెల ఆంజనేయులు



**పెద్దమందడి, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** నారాయణపేట జిల్లా బిజ్వార్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ అంబాత్త్రయ క్షేత్రంలో ఈ సంవత్సరం దుర్గామాత నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించబడుతున్నాయి.

ఈ ఉత్సవాలు సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ 2 వరకు భక్తుల సందడి మధ్య కొనసాగనున్నాయని, స్వామీజీ భక్తుడు పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామానికి చెందిన గుండెల ఆంజనేయులు తెలిపారు.

ఈ సందర్భంగా భక్తులకు ప్రత్యేకంగా 108 హరతుల దర్శనం లభించనుంది. అంతేకాక, ఈ దివ్యమైన పసుపు వంటి కితాత ద్వారా భక్తుల అన్ని దోషాలు తొలగి, పదహారు ఐశ్వర్య కళ్ళు ప్రసాదముగా లభిస్తాయని విశ్వాసం. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని గుండెల ఆంజనేయులు పిలుపునిచ్చారు.

# పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములుగా చేయాలి

## హనుమకొండ జిల్లా విద్యాధికారి వాసంతి




**హనుమకొండ,సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** సెప్టెంబర్ 20న తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల సమావేశం ప్రభుత్వ,స్థానిక సంస్థల, కస్తూరిభా గాంధీ విద్యాలయాలు,తెలంగాణ ఆదర్శ పాఠశాలలో సంతోషకరమైన సురక్షితమైన దసరా సెలవులు అనే అంశంపై సమావేశం నిర్వహించాలని హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి ఆదేశించారు. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులకు విధిగా రాతపూర్వకంగా లేదా ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి తల్లిదండ్రులు హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారులు,స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వారి పరిధిలో గల పాఠశాలలలో తల్లిదండ్రుల సమావేశం జరుగుతున్న తీరును పరిశీలించాలని అన్నారు. ఏ పాఠశాలలో తల్లిదండ్రులు హాజరు తక్కువగా ఉంటుందో వాటి మీద ప్రధానంగా దృష్టి పెట్టాలని కోరారు. చాలామంది తల్లిదండ్రులు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు,పట్టణ ప్రాంతాల్లో రోజువారి కూలీలుగా పనిచేస్తుంటారు.కాబట్టి వారికి వీలైన సమయంలో సమావేశం నిర్వహించాలని అన్నారు.తల్లిదండ్రుల సమావేశంలో పిల్లల యొక్క బేస్ లైన్ పరీక్ష, నిర్మాణాత్మక పరీక్షల,ప్రీ మిడ్ లైన్ పరీక్షల ఫలితాల గురించి చర్చించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించాలని చెప్పారు. హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడాలని పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములుగా చేయాలని అదనపు సమాచారం కోసం కమ్యూనిటీ మొబైలైజింగ్ అధికారి బద్దం సురేష్ రెడ్డి 9603672289ను సంప్రదించాలని అన్నారు.

# గంగారం చీకటిని పారద్రోలి వెలుగులు నింపిన మధుబాబు!

## సొంత ఖర్చుతో 450 వీధి దీపాలు ఏర్పాటు



**సత్తుపల్లి, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలం, గంగారం గ్రామం అభివృద్ధి దిశగా మరో ముందడుగు వేసింది. గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుండే మాజీ వైస్ఎంపీపీ దాసరి వెంకటరామిరెడ్డి (చిట్టి నాయన) తనయుడు దాసరి మధుమోహన్ రెడ్డి (మధుబాబు) సొంత ఖర్చుతో గ్రామమంతా 450 వీధి దీపాలను ఏర్పాటు చేసి విశేష ప్రశంసలు అందుకున్నారు.

గట్టు బజార్, చాకలి బజార్, చిన్న సెంటర్, తూర్పు బజారు, పాత హరిజనవాడ, యాదవ బజార్, నాచారం రోడ్, జలగం నగర్ 1, జలగం నగర్ 2, గురుభట్లగూడెం రోడ్, మసీదు రోడ్, ప్రకాష్ నగర్ కాలనీ వంటి ప్రాంతాల్లో కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసి ఒక్కో స్తంభానికి లైట్లు అమర్చించారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో యూత్ సభ్యులతో సర్వే చేయించాను. 450 లైట్లు అవసరమని తేలడంతో సొంత డబ్బుతోనే ఏర్పాటు చేశాను. గంగారం అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ ప్రజల పక్కనే ఉంటాను అని మధుబాబు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ యువత, ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఎల్ వోసీ మంజూరు పత్రం అందజేసిన ఖమ్మం ఎంపీ



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 19, తెలంగాణ ముచ్చట్లు;** తిరుమలాయ పాలెం మండల కేంద్రానికి చెందిన కొమ్ము ముత్తయ్య కూతురు ఆద్వితా నందనకు నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) లో అత్యవసర శస్త్ర చికిత్స కోసం ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంఆ ర్ఎఫ్) నుంచి రూ. 2లక్షలకు ఎల్ ఓ సీ పత్రం మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ లోని తన నివాసం వద్ద బాధిత కుటుంబానికి.. ఎంపీ రామసహాయం అందజేశారు. ఇటీవల బాలిక తల్లిదండ్రులు ఎంపీని కలిసి..క్రానియల్ రీమోడలింగ్ ఆప రేషన్ చేయించాల్సి ఉందని, ఆర్థిక తోడ్పాటు అందించాల్సిందిగా విన్న వించగా వెంటనే స్పందించి ఈ మేరకు మంజూరు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మెదడు ఎదు గుదలకు అనుకూలంగా తల ఆకృతి మార్పు కోసం జరిగే ఈ శస్త్ర చికిత్స విజయవంతం కావాలని, ఆ చిన్నారి పూర్తి ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాల ని.. ఆకాంక్షించారు.




# నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఘటనపై నిరసనలు పూర్తి స్థాయి విచారణకు డిమాండ్

**నాచారం, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చ-ట్లు)** ఉప్పల్ నియోజకవర్గం నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి రిశాంత్ రెడ్డిపై "బర్త్ డే బంప్స్" పేరిట తోటి విద్యార్థులు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో విద్యార్థి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది.బాధిత విద్యార్థి తల్లిదండ్రులు పన్నాల సునీత, బోర్రా చం ద్రశేఖర్ రెడ్డి వివరాల ప్రకారం – ఆగస్టు 29న పుట్టిన రోజు సందర్భంగా స్కూల్‌కి వెళ్లిన తమ కుమారుడిని తోటి విద్యార్థులు కిక్కులు, దెబ్బలు కొట్టి మర్మాంగాలపై గాయాలు కలిగించారు. రక్తస్రావం జరి గినప్పటికీ పాఠశాల యాజమాన్యం ఆల స్యంగా ఆసుపత్రికి తరలించిందని వారు ఆరోపించారు. వైద్యులు విద్యార్థి వృషణం దెబ్బతిన్నట్లు నిర్ధారించారని, వెంటనే శస్త్ర చికిత్స జరిపినట్లు తెలిపారు.ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని తల్లిదండ్రులు ఆరోపించా రు. బాధిత విద్యార్థి వైద్య ఖర్చులు యాజ మాన్యం భరించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, పోలీసులను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మల్క కొమురయ్యపై కేసు నమోదు చేయాలని కోరారు.ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ధర్నా ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవై ఎఫ్), అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐ ఎస్ఎఫ్) నాయకులు నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేం ద్ర, జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లా డుతూ – "స్కూల్ యాజమాన్యం ధనదోపి డీపై మాత్రమే శ్రద్ధ చూపుతుండగా, విద్యా ర్థుల భద్రతపై శ్రద్ధ లేకపోవడం సిగ్గుచేటు" అని విమర్శించారు."విద్య హక్కు చట్టాన్ని అమలు చేయకపోవడంతో పాటు సమాజా నికి అవసరమైన విలువలు, క్రమశిక్షణను పెంపొందించకపోవడం వల్లనే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయి" అని ఆగ్రహం వ్యక్తం చేశారు."ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. ప్రధాన డిమాండ్లు: ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు. పోలీసు లను తప్పుదారి పట్టించిన చైర్మన్ మల్క కొ మురయ్యపై కేసు నమోదు.బాధిత విద్యార్థి వైద్య ఖర్చులు యాజమాన్యం భరించాలి. భవిష్యత్తులో విద్యార్థుల భద్రతకు కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ ధర్నాలో ఏఐవైఎ ఫ్ నేతలు గిరిబాబు, శేఖర్, రాకేష్, ప్రభు, శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ నేతలు మహేష్, అజీమ్ పాషా, సమీర్, సోను, షాబాజ్, ఇర్ఫాన్, రాజేష్, విజయ్‌కుమార్, ఆకాష్, అజయ్, స్వాజిత్, జీవన్, వికాస్ తదితరు లు పాల్గొన్నారు.

# అంగనవాడి వర్కర్ల ముందస్తు అరెస్టులపై సిఐటియు ఆగ్రహం





**మేడ్చల్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ము-చ్చట్లు):** ప్రజా పరిపాలన – ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలను విని పించడానికి వెళ్తున్న మేడ్చల్ ప్రాజెక్ట్ అం గనవాడి నాయకులను పోలీసులు ముం దస్తుగా అరెస్టు చేయడాన్ని సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె. ఉన్నికృష్ణన్ తీవ్రంగా ఖండించారు. అంగనవాడి యూనియన్ జిల్లా కార్య దర్శి బి. శోభారాణితో పాటు పలువురు ప్రాజెక్ట్ నాయకులు మెమొరాండం సమర్పించడానికి ప్రయత్నిస్తుండగా, ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమం లేకపో యినా అక్రమంగా వారిని అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. "ప్రజా పరిపాలన పేరిట ప్రభుత్వం గొప్పలు చె ప్పుకుంటూ, సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన కార్మికులను ముందుగానే అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసం? కా ర్మికులు తమ హక్కుల కోసం పోరాడటం నేరమా?" అని ప్రశ్నించారు.అలాగే అం గన్వాడి వ్యవస్థను నిర్వీర్యం చేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ, "ప్రజా శ్రేయస్సు కోసం యూనియన్లు ఎప్పటికీ అంగనవాడి వ్యవస్థను బలోపేతం చే యడానికి కృషి చేస్తాయి. కానీ ఇలాంటి అణచివేత చర్యలు కొనసాగితే పోరాటా న్ని తీవ్రతరం చేస్తాం" అని హెచ్చరిం చారు.ప్రజాస్వామ్య దేశంలో కార్మికుల హక్కులను రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, ఇలాంటి చర్యలు వెంటనే ఉపసం హరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# అంగనవాడి వర్కర్ల ముందస్తు అరెస్టులపై సిఐటియు తీవ్ర ఖండన

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అంగనవాడి యూనియన్ జిల్లా కార్యదర్శి బి. శోభారాణి, అల్వాల్ ప్రాజెక్ట్ నాయకులు,మల్కాజిగిరి -నేరేడ్మెట్ -అల్వాల్ ప్రాంతాల అంగనవాడి వర్కర్లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చే యడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండించింది. జిల్లా సిఐటియు కోశాధికారి కె. ఉన్ని కృష్ణన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ –"ప్రజా పరి పాలన, ప్రజావాణి పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటున్న ఈ రోజుల్లో కార్మికులు తమ సమస్యలు వినిపించుకోవ డానికి ప్రయత్నిస్తే, వారిని ముందే అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ఇది ప్రజా పరిపాలనకు నిదర్శనమా?" అని ప్రశ్నించారు.ప్రజావాణి వెళ్లనివ్వకుండా ముందే అడ్డుకట్ట అంగనవాడి టీచర్లు, హెల్ప ర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజా వాణి కార్యక్రమంలో మెమోరాండం ఇవ్వడా నికి సిద్ధమవుతుండ గా, ఎటువంటి కారణం లేకుండా వారిని అదుపులోకి తీసుకోవడం అన్యాయమని ఆయన అన్నారు."గత ప్రభు త్వ కాలంలో పెట్టిన గోడను కూల్చి ప్రజల సమస్యలకు వేదిక కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు మాత్రం కార్మికుల గొంతు మూయడమే చేస్తోంది" అని మండిపడ్డారు. అంగనవాడి వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం శ్రీవిద్య పేరుతో అంగనవాడి వ్యవస్థను నిర్వీర్యం చేయాలనే కుట్ర పన్నుతున్నాయని, కానీ ప్రజా శ్రేయస్సు దృష్ట్యా యూనియన్లు మాత్రం అంగనవాడి వ్యవస్థ బలోపేతం కావాలని కోరుకుంటున్నాయని ఉన్నికృష్ణన్ అన్నారు."ప్రభుత్వం పట్ల మాకు ఎలాంటి భయం లేదు. వర్కర్ల హక్కుల కోసం పోరాటం ఆగదు. ఈరోజు ముందస్తు అరె స్టులు ప్రారంభం అయితే, రేపటి రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం మిన్నంటుతుం ది" అని హెచ్చరించారు."ప్రజా సమస్యలు వినిపించడం నేరమా?"అరెస్టులకు గురైన అంగనవాడి నాయకులు మాట్లాడుతూ "ప్ర జాస్వామ్యంలో కార్మికులు తమ సమస్యలు చెప్పుకోవడం నేరమా? సమస్యలు పరిష్కరిం చకుండా అరెస్టులు చేయడం వల్ల ప్రభుత్వ ప్ర తిష్టే దెబ్బతింటుంది. ఈ విధానాన్ని ప్రజలు తప్పక ప్రశ్నిస్తారు" అని విమర్శించారు. సిఐటియు హెచ్చరిక:ప్రభుత్వం వెంటనే ముందస్తు అరెస్టుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే అంగనవాడి యూ నియన్లు మరింత కఠినమైన పోరాటాలకు దిగుతాయని సిఐటియు స్పష్టం చేసింది."కా ర్మికుల పట్ల సాన్నిహిత్యం చూపాల్సిన ప్రభు త్వమే ఈరోజు వారిని అరెస్టు చేస్తే, అది ప్రజా పాలనా కాదు – దమన పాలన" అని గట్టిగా ప్రకటించింది.

# బతుకమ్మ ప్రారంభోత్సవానికి సిద్ధం అవుతున్న హనుమకొండ



- 21న వెయ్యి స్తంభాల దేవాలయంలో రాష్ట్ర స్థాయి వేడుకలు
- అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశాలు
- మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖుల హాజరు
- విద్యుత్, నీరు, భద్రత, పారిశుద్ధ్యం పై దృష్టి

**హనుమకొండ,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** బతుకమ్మ ప్రారంభోత్సవ వేడుకలకు కావలసిన అన్ని ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, భాషా సాంస్కృతిక, పర్యాటక సహా పలు శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21న హను మకొండలోని చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో రాష్ట్రస్థాయి బతుకమ్మ ప్రారంభోత్సవం ఘనంగా జరగనున్నదని, విద్యుత్ లైటింగ్, సౌండ్ సిస్టం, తాగునీరు, పోలీస్ బందోబస్తు, పారిశుద్ధ్యం వంటి ఏర్పాట్లు ఖచ్చితంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తే వేడుకలు విజయవంతమవుతాయ ని అన్నారు.
ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్కతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జీడీఓ మేన శ్రీను, ఆర్డీవో రాథోడ్ రమేష్, పర్యాటక శాఖ అధికారి శివాజీ, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ముదిగొండ, బోనకల్, చింతకాని పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం



**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 19, తెలంగాణ ముచ్చట్లు;** శిక్షల శాతం మరింత పెంచేందుకు అత్యున్నత ప్రమాణాలతో కేసుల దర్యాప్తు చేపట్టాలని పోలీసు అధికా రులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదే శించారు. శుక్రవారం ముదిగొండ, బోనకల్, చింతకాని పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారుల తో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది.సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ..పోలీస్ స్టేషన్లలో వచ్చే ఫిర్యాదుల ఆధారంగా వెంటనే కేసులు నమోదు చేయాలని, ప్రజలతో మర్యాదపూ ర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. కమ్యూనిటీ పోలీసింగ్ కు ప్రాధన్యత ఇవ్వా లని అన్నారు. నేరాల నియంత్రణ, కేసు దర్యాప్తులు, ప్రజా భద్రత కోసం అమలు చేస్తున్న ప్రత్యేక చర్యలకు సంబంధించిన కీలక అంశాలపై ప్రతేక దృష్టి సారించాల ని అన్నారు. అక్రమ రవాణా, దందాలు, అసాంఘిక కార్యకాలాపాలపై కఠినంగా వ్యవహారించాలి ఆదేశించారు.నేరాల ని యంత్రణలో మరింత చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రజల మనసులు చూరగొనాలని అన్నారు. ప్రజలకు ధైర్యం కల్పించేందుకు విజిబుల్ పోలీసింగ్ ను అనుసరించాలంటూ దాని ప్రా ధాన్యాన్ని వివరించారు.స్టేషన్ హౌస్ ఆఫీసర్ల పనితీరును అంచనా వేసేందుకు నేర సమీక్ష సమావేశాలు డివిజన్ పోలీస్ అధికారులు నిర్వహించాలని సూచించారు.పోలీస్ అధి కారుల పోలీస్ స్టేషన్లను క్రమం తప్పకుండా సందర్శించి, పనితీరును సమీక్షించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించాలని,అదేవిధంగా, నేర పరి శోధనలు మరియు అరెస్టులలో సహాయ పడే సిసిటివి కెమెరాలతో సహా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎక్కువగా ఉపయోగించాలని సూచించారు. డిజిటల్ యుగంలో పెరు గుతున్న సైబర్ నేరాల ధోరణిని ఎదుర్కోవ డానికి, అవగాహన మరియు నివారణను పటిష్టమైన సాంకేతిక చర్యలను అమలు చేయాలని అధికారులను కోరారు. విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, పెట్రో లింగ్‌ను బలోపేతం చేసేందుకు అవసర మైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యువత మాదకద్రవ్యాల వ్యసనం మరియు నేర కార్యకలాపాలకు బలైపోకుండా నిరో ధించడానికి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రానున్న ఎన్నికల దృష్టిలో పెట్టుకొని గ్రామాలలో ప్రశాంత వా తావరణం ఉండేలా సెక్టర్ పోలీస్ ఆఫీసర్లు ముందస్తు, సమాచారం, ప్రణాళిక సిద్ధం చే సుకోవాలని సూచించారు. లప్రజా భద్రతను పెంపొందించే ప్రయత్నంలో, చోరీ కేసుల్లో నిందుతులను అరెస్టు చేయడం, అలవాటు పడిన నేరస్థులను ట్రాక్ చేయడం మరియు పునరావృతం కాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రైతులకు అందించే యూరియా పంపిణి సమయంలో సమస్యలు తల్లెత్తకుండా అప్ర మత్తంగా ఉండాలని అన్నారు. సమావేశం లో సిసిఆర్బి ఇన్స్పెక్టర్ స్వామి, మురళి, ఎస్సై లు పాలొన్నారు.





# రాచకొండ పోలీసులకు సేవా పతకాలు భవిష్యత్తులో మరిన్ని సాధించాలన్న సీపీ సుధీర్ బాబు ఐపీఎస్

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** రాచకొండ పోలీస్ కమిషనరే ట్ పరిధిలో విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని రాచకొండ సీపీ సుధీర్ బాబు ఐపీఎస్ శుక్రవారం సన్మానించారు. సీపీ చేతుల మీదుగా 65 మంది పోలీసు సిబ్బందికి సేవా పతకాలు అందజేయబడ్డాయి. వీరిలో కానిస్టేబుల్ స్థాయి నుంచి అడిషనల్ డీసీపీ ర్యాంక్ వరకు ఉన్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ – "విధి నిర్వహణలో అసామాన్య ప్రతిభ కనబరిచిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సేవా పతకాల రూపంలో గౌరవం అందిస్తాయి. పతకాలు పొందడం కేవలం గర్వకారణమే కాకుండా, మరింత బాధ్యతను గుర్తు చేస్తుంది. ప్రజల కు అంకితభావంతో సేవ చేయడం ద్వారా రాబోయే రోజుల్లో ఇంకా బహుమతులు, పతకాలు సాధించవచ్చు" అని అన్నారు. ఇతర సిబ్బంది కూడా పతకాలు అందుకున్న వారిని స్ఫూర్తిగా తీసుకొని కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాక, భువనగిరి ఏసిపి రాహుల్ రెడ్డి ఐపీఎస్ కు అడిషనల్ ఎస్పీగా ప్రమోషన్ రావడంపై ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్ర మంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజ ఐపీఎస్, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్ ఐపీఎస్, భువనగిరి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్ ఐపీఎస్, మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, క్రైమ్స్ డీసీపీ అరవింద్ బాబు, అడ్మిన్ డీసీపీ ఇందిరా, ఎస్వోటి డీసీపీ రమణ రెడ్డి, ఎస్బీ డీసీపీ నరసింహ రెడ్డి, ట్రాఫిక్ డీసీపీలు మనోహర్, శ్రీనివాసులు, సైబర్ క్రైమ్ డీసీపీ నాగలక్ష్మి, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ శ్యాంసుందర్, అడిష నల్ డీసీపీలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కలెక్టర్ దృష్టికి మల్లాపూర్ ఖాళీ స్థల సమస్య

**స్థానికులకు కమ్యూనిటీ హాలు – పార్క్ అవసరం: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి తో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరీ (ఐఏఎస్) ను కలిసారు. ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన అంశాలు:
మల్లాపూర్ గ్రామ సర్వే నం. 44, 45లో ఎన్ఎఫ్సి సంస్థ పక్కన ఖాళీ స్థలం అనధికార కబ్జాలకు గురవుతోంది.ఆ స్థలం గతంలో టీఎస్ఐఐసి నుంచి మౌలాలి ఐఏఎల్ఏ కి అప్పగించబడినదని గుర్తు చేశారు.స్థానిక ప్రజల తరపున ప్రభుత్వం ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని కమ్యూనిటీ హాలు, పార్క్ గా అభివృద్ధి చేయాలని సూచించారు.అలాగే ఎన్ఎఫ్సి నిర్మిస్తున్న ప్రహరీ గోడను తక్షణం ఆపాలని కోరారు.జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరీ సమస్యను పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.ఈ కార్యక్రమంలో బోదాసు లక్ష్మినారాయణ, నాగారం బాబు, దుర్గయ్య, నాగారం చంద్రశేఖర్, రాపోల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రణాళిక ప్రకారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**హన్మకొండ,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ప్రణాళిక ప్రకారం ఓటరు జాబితాపై స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.
శుక్రవారం ఎన్నికల సంఘం కార్యాలయం నుండి అదనపు సీఈఓ లోకేష్ కుమార్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్ నిర్వహణకు ముందు ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో 2002 ఎస్ఐఆర్ డేటాను 2025 ఎస్ఎస్ఆర్ డేటాతో పోల్చుకోవాలని సూచించారు. ఈ రెండు జాబితాలలో కామన్‌గా ఉన్న పేర్లు మినహా చేసి, 2002 తర్వాత ఓటర్లుగా నమోదైన వారి వివరాలను క్షేత్ర స్థాయిలో మరోసారి ధృవీకరించాల్సి ఉంటుందని తెలిపారు. ఎస్ఐఆర్ నిర్వహణపై మాస్టర్ ట్రైనర్ల ద్వారా బూత్ స్థాయి సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచన మేరకు బీహార్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఇటీవల ఎస్ఐఆర్ విజయవంతంగా నిర్వహించినట్లు గుర్తుచేశారు.ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రిటర్నింగ్ అధికారులు, ఏఈఆర్ఓలు, డిప్యూటీ తహసీల్దార్లు, బిఎల్ఓలు, సూపర్వైజర్లతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజూ స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, కార్యాచరణ ప్రకారం ఎస్ఐఆర్ పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కే. నారాయణతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# మూడు రోజుల సెలవు... రైతులకు నష్టం!

**గెలలు రాలిపోతున్నాయంటూ అశ్వరావుపేట, దమ్మపేట రైతుల ఆవేదన**

**శ్వారావుపేట, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** పామాయిల్ రైతులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. అశ్వరావుపేట, అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీల యాజమాన్యం సెప్టెంబర్ 19, 20, 21 తేదీల్లో వరుసగా మూడు రోజుల సెలవులు ప్రకటించడం రైతుల గుండెల్లో ధడధడలేస్తోంది. ఫ్యాక్టరీలు 22నుంచి గెలల కొనుగోలు చేస్తామని ప్రకటించినా, అప్పటికే కోసిన గెలలు పండిపడి నేలరాలిపోతున్నాయంటూ రైతులు వాపోతున్నారు.
గెలలు కోసిన తర్వాత ఆలస్యం అయితే బరువు తగ్గిపోతుంది. దీంతో వెయిట్ లాస్ వలన ఆర్థికంగా భారీ నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. “ఎరువులు, పనివారి కూలీలు భరించలేని స్థాయిలో పెరిగిపోయాయి. అలాంటిదే వరుస సెలవులు ఇవ్వడం పంట వృథా అవ్వడానికి దారితీస్తోంది” అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. “ఇలాంటి నిర్ణయాల పై ముందుగానే రైతులకు సమాచారం ఇవ్వాలి. గెలలు పండిన వెంటనే కొనుగోలు జరగాలి. వరుస సెలవుల వలన రైతులు పడే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జోక్యం చేసుకుని పరిష్కారం చూపాలి” అని వారు డిమాండ్ చేస్తున్నారు.





# టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి – ఎంపీ ఈటల రాజేందర్

**మేడ్చల్ మల్కాజ్గిరి, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** టెక్నాలజీ ఆధునిక సమాజానికి అవసరమని, కానీ అది మానవ అవసరాలను పూర్తిగా భర్తీ చేయకూడదని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పేర్కొన్నారు. నగరంలో జరిగిన ఆధునిక కెమెరాల ఎగ్జిబిషన్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు.ఫోటోగ్రఫీ ఒక కళ:“ఫోటోగ్రఫీ అనేది సాధారణ వృత్తి కాదు, అది ఒక కళ. ఈ కళ అందరికీ రాదు. ఆధునిక కెమెరాలు వచ్చినా, దాన్ని సృజనాత్మకంగా వినియోగించేవారే నిజమైన కళాకారులు అవుతారు” అని ఎంపీ రాజేందర్ అన్నారు.
టెక్నాలజీ – ఉపాధి సంబంధం
టెక్నాలజీని ఉపాధి అవకాశాలను పెంచే విధంగా ఉపయోగించుకోవాలని సూచించారు. “రోబోలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కొత్త ఆవిష్కరణలు రాకతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తొలగింపబడ్డారని వచ్చే వార్తలు బాధాకరం. 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశంలో ఉపాధి తగ్గితే సమస్యలు మరింత ఉత్కంఠభరితంగా మారతాయి. ఒకప్పుడు మనిషిని సంపాదనగా భావించిన సమాజం ఇప్పుడు భారంగా మారిపోతుందనే పరిస్థితి కలవరం కలిగిస్తోంది. ఇంతటి జనాభాకు ఉపాధి కల్పించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత” అని అన్నారు.
మేక్ ఇన్ ఇండియా – రక్షణ రంగంలో స్వయం సమృద్ధి
ప్రధాని మోడీ దేశాన్ని ఆర్థిక పరంగా ముందుకు తీసుకెళ్తున్నారని ఆయన ప్రశంసించారు. “మేడ్ ఇన్ ఇండియా – మేక్ ఇన్ ఇండియా కలను నిజం చేస్తూ రక్షణ రంగంలో స్వయం సమృద్ధిగా తయారయ్యాం. నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు 4 లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించడం చారిత్రాత్మకం. యువత ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా నిలుస్తోంది” అని వివరించారు.
యువశక్తి – దేశ బలం
“ప్రపంచంలో అత్యధిక యువశక్తి కలిగిన దేశం మనది. ఆ శక్తి నిర్వీర్యం కాకుండా జాతీయాభివృద్ధి దిశగా మలచుకోవాలి. ఆర్థిక పరంగా 11వ స్థానంలో ఉన్న భారతదేశాన్ని 4వ స్థాయికి తీసుకువచ్చారు. జీడీపీలో వేగంగా దూసుకుపోతున్న దేశం మనదే” అని రాజేందర్ గర్వంగా చెప్పారు.
వ్యాపారాలకు ప్రోత్సాహం:
తన ప్రసంగంలో చిన్న వ్యాపారాల ప్రాధాన్యతను కూడా ఈటల వివరించారు. “మీ వృత్తిలో మానవ సంబంధాలను ఎక్కువగా కలిగి ఉండండి. అప్పుడే మీకు ఎక్కువ బిజినెస్ వస్తుంది. చిన్న వ్యాపారాలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహక పథకాలను అందిపుచ్చుకుని ముందుకు సాగాలని యువతను కోరుతున్నాను. మీ సమస్యలపై నాకు అవగాహన ఉంది. నా సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది” అని హామీ ఇచ్చారు.

# విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

**వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

**పెద్దమందడి, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆకర్షణీయంగా తయారు చేసిన కొత్త తరగతి గదులను జిల్లా పోలీసు అధికారి రావుల గిరిధర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశారు.జిల్లా ఎస్పీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ – “విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి. తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి చేరుకోవాలి. మీరు అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే నిబద్ధతతో కఠినంగా శ్రమించాలి. ప్రణాళికాబద్ధంగా చదవడం ద్వారా కలలను సాకారం చేసుకోవచ్చు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివితే కావలసిన ఉద్యోగాలు సాధించవచ్చు” అని సూచించారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పుడు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, రాష్ట్రంలో పేరొందిన ప్రముఖులు, అధికారులు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత స్థానాలకు చేరారని గుర్తు చేశారు. మంచి పుస్తకాలు, మంచి స్నేహితులు ఎంచుకుంటే జీవితంలో విజయాలు సాధ్యమని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి మంజులత, పెద్దమందడి పోలీసు అధికారి శివకుమార్, పన్నుల శాఖ అధికారి ప్రసన్న రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బండి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రోజా రాణి, కిరణ్ కుమార్, సుచిత్ర, ఈశ్వర్, మధు తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.






# నాగారం మున్సిపాలిటీలో వర్షం విపత్తు

**ప్రహరిగోడ కూలిపోవడం – కుటుంబం సురక్షిత ప్రాంతానికి తరలింపు**
**రహదారుల మూసివేత – అనారోగ్యులకు వైద్య సహాయం**
**నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి**





**నాగారం, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):**
నాగారం మున్సిపాలిటీ పరిధిలో భారీ వర్షాలు కురుస్తుండటంతో పలు కాలనీలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. వరద ఉధృతి కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు నిత్యజీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి, అత్యవసర చర్యలు చేపట్టారు. ఇంటి ప్రహరిగోడ కూలిన ఘటన:విజయపురి కాలనీలో నాళా ఒడ్డున నిర్మించిన ఓ ఇంటి ప్రహరిగోడ మరియు పునాదులు వరద నీటి ఒత్తిడికి ధ్వంసమయ్యాయి. ఇల్లు కూలిపోవడానికి ముందే మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు వేగంగా స్పందించి, ఆ కుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ ఘటన పెద్ద ప్రమాదం తప్పించిందని స్థానికులు పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి సహాయం:అరవింద్ నగర్ కాలనీలో రోడ్లు నీట మునిగిపోవడంతో ఒక వ్యక్తి అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది తక్షణమే స్పందించి, ఆటో రిక్షా సౌకర్యం కల్పించి సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.రహదారుల తాత్కాలిక మూసివేత: రాంపల్లి-చర్లపల్లి మార్గంలోని ప్రధాన నాళా మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రమాదాలను నివారించడానికి అధికారులు ఆ రహదారిని తాత్కాలికంగా మూసివేశారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని సూచించారు.అత్యవసర నివాస కేంద్రాల ఏర్పాటు:ప్రభావిత కుటుంబాల కోసం మున్సిపాలిటీ అత్యవసర నివాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో భోజనం, తాగునీరు, విద్యుత్, వైద్య సహాయం వంటి సదుపాయాలు కల్పించారు. ప్రతి కేంద్రానికి బాధ్యత వహించే అధికారులను నియమించారు.నివాస కేంద్రాల వివరాలు:ఎస్. నం. నివాస కేంద్రం పేరు లొకేషన్ ఇన్‌చార్జ్ పేరు అరవింద్ నగర్ కమ్యూనిటీ హాల్ ఎ ల్. అనిల్ కుమార్ (వార్డ్ ఆఫీసర్). రాచా రామ్ రెడ్డి ఫంక్షన్ హాల్ మహేష్ ఠాకూర్ (బిల్ కలెక్టర్). గొడుమకుంట వార్డ్ ఆఫీస్ హేష్ ప్రసాద్ (బిల్ కలెక్టర్). బొగరం వార్డ్ ఆఫీస్ పి. రవీంద్రనాథ్ (బిల్ కలెక్టర్). కరీంగూడా వార్డ్ ఆఫీస్ బి. ధర్మారెడ్డి (ఆర్ఐ). రాంపల్లి దయారా వార్డ్ ఆఫీస్ బి. ధర్మారెడ్డి (ఆర్ఐ). ఎస్సీ కమ్యూనిటీ హాల్ రాజ్ కుమార్ (బిల్ కలెక్టర్), రమేష్ (బిల్ కలెక్టర్).ప్రజలకు అధికారుల విజ్ఞప్తి: “వర్షం ప్రభావితులు భయపడవద్దు. నివాస కేంద్రాల్లో అన్నం, తాగునీరు, మందులు సిద్ధంగా ఉన్నాయి. ఎవరికైనా అత్యవసర అవసరాలు ఉంటే వెంటనే వార్డు సిబ్బందిని సంప్రదించాలి” అని మున్సిపల్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# చింతకాని సబ్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన వీరేందర్

**శుభాకాంక్షలు తెలిపిన చింతకాని ప్రెస్ క్లబ్ సభ్యులు.**

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 19, తెలంగాణ ముచ్చట్లు:** చింతకాని సబ్ ఇన్స్పెక్టర్ గా వీరేందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎస్ఐ వీరేందర్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం చింతకాని మండల ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జొన్నలగడ్డ మల్లీశ్వరి, కార్యదర్శి వెన్నబోయిన సురేందర్, ప్రెస్ క్లబ్ సలహాదారుడు గండరాపు రామారావు, కోశాధికారి గొర్రెముచు కరుణాకర్, కార్యవర్గ సభ్యులు శెట్టి సురేష్,జొన్నల గడ్డ సందీప్ రెడ్డి,గంటల తిరుమల చారి,పిచ్చయ్య మరియు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీరంగాపూర్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన హిమబిందు



**వనపర్తి,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ పోలీసు స్టేషన్ నూతన ఎస్సైగా కె. హిమబిందు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై హిమబిందు, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ - "విధుల పట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించరాదు. ప్రజల భద్రత, శాంతి పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి" అని సూచించారు. హిమబిందు గతంలో వనపర్తి జిల్లా ఆత్మకూరు పోలీసు స్టేషన్ లో రెండవ ఎస్సైగా పనిచేశారు. బదిలీపై శ్రీరంగాపూర్ లో కొత్తగా బాధ్యతలు చేపట్టారు. ఇదే సమయంలో, ఇక్కడి మాజీ ఎస్సై రామకృష్ణ జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీపై వెళ్లారు.

"శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం చాలా అవసరం. అందరూ సహకరించాలి" అని బాధ్యతలు స్వీకరించిన హిమబిందు ప్రజలను కోరారు.

## యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదానం

గుంపల్లి రాములు కుటుంబాన్ని అభినందించిన కాగితాల మధు నేత్రదానం చేసి ఆదర్శంగా నిలిచిన వంశీ



**ఖిల్లా ఘనపూర్,సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదానం జరిపినట్లు సంస్థ అధ్యక్షులు కాగితాల మధు తెలిపారు. వివరాల్లోకి వెళితే, ఖిల్లా గణపురం మండలం గట్టుకాడిపల్లి గ్రామానికి చెందిన గుంపల్లి రాములు కుమారుడు గుంపల్లి వంశీ (24) నిన్న కొత్త మొల్గర సమీపంలో ఆటో బోల్తాపడటంతో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి, వంశీ నేత్రాలను మహబూబ్నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా దానం చేశారు. వాటిని హైదరాబాద్ ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు.

"నా కుమారుడు ఇక లేడు కానీ, మరొకరి కళ్ళ రూపంలో కనిపిస్తాడు" అని గుంపల్లి రాములు చెప్పడంతో గ్రామస్థులు ఆయనను అభినందించారు.

"ఎవరైనా అనుకోని మరణం జరిగితే ఆరు గంటల లోపు నేత్రదానం చేయాలి. యువత నేత్రదానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలి" అని యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు పిలుపునిచ్చారు. నేత్రదానం చేయాలనుకునేవారు 9908806285 కు సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి కార్నియా నిపుణుడు శివ, యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షులు కాగితాల మధు, మాజీ సర్పంచ్ దేవేందర్, ఆమ్రోజి రాములు, ఖాదర్, శంకర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుడు సింగిరెడ్డి మాధవ రెడ్డి 16వ వర్ధంతి



ఘనంగా నివాళులు అర్పించిన స్థానిక ప్రజాప్రతినిధులు

**నాగారం, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** స్వాతంత్ర్య సమరయోధులు స్వర్గీయ సింగిరెడ్డి మాధవ రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా నాగారంలో నివాళులర్పణ కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పౌర సమాజం కలిసి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. నాగారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, నాగారం మాజీ సర్పంచ్ గూడూర్ అశోక్ గౌడ్ ప్రత్యేకంగా హాజరై పుష్పగుచ్ఛాలు సమర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాదిరెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ -"స్వాతంత్ర్యసమరయోధుల త్యాగాల వలన ఈరోజు మనం స్వేచ్ఛా గాలి పీలుస్తున్నాం. సింగిరెడ్డి మాధవ రెడ్డి స్వదేశీ భావజాలానికి కట్టుబడి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కలిగించారు. ఆయన త్యాగం కొత్త తరాలకు స్ఫూర్తి కలిగించేదిగా నిలుస్తుంది" అని అన్నారు.ప్రజలు, స్థానిక కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, మాధవ రెడ్డి సేవలు, త్యాగాలను గుర్తు చేసుకున్నారు.నేతల పిలుపు ప్రస్తుత యువత, భవిష్యత్ తరాలు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను మరువకుండా, దేశాభివృద్ధి కోసం కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు.





## తగ్గుతున్న పచ్చిమిరపకాయ ధరలు.. రైతు ఆవేదన

తెలంగాణ ముచ్చట్ల
జోగులాంబ గద్వాల జిల్లా

రాజోలి మండల కేంద్రంలో ఉన్నటువంటి మిర్చి వ్యాపారివేత ఉప్పరి మల్లాకల్ అనే రైతు పది ఎకరాలు మిర్చి పండిస్తూ ఎంతో మంది కూలీలకు ఉపాధి కల్పిస్తూ వారి వారికి నష్టము వాటిల్లిన తమ సొంత ధైర్యంతో ముందుకు సాగి వారి వ్యవసాయానికే ప్రాణం పోసి ఎంతో నాణ్యతమైన మందులు పిచికారి చేసే వైద్యంగా ఎరువులను దుక్కిలో కలిపి కంటికి రెప్పలా కాపాడుతూ పంటను పండించి జాగ్రత్తగా మార్కెట్ యార్డ్ కర్నూల్ దళాలికి కి పంపగా అక్కడ ఉన్నటువంటి మార్కెట్ యాడ్ లో మిర్చి రేటు రోజుకు తగ్గిపోవడంతో పచ్చి మిరపకాయ వేసి నటువంటి రైతులు ఎంతో తమకు తాను పండించిన పంట పెట్టిన పెట్టుబడి రాక గిట్టుబాటు ధర లేక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు





## విద్యార్థి దశ జీవితంలో కీలకం

పెద్దమందడి ఎస్సై శివకుమార్

**పెద్దమందడి,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** మనిషి జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమని పెద్దమందడి ఎస్సై శివకుమార్ అన్నారు. శుక్రవారం పెద్దమందడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చెప్పులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా పోలీసు అధికారి రావుల గిరిధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బూట్లను పంపిణీ చేసి, వారితో కలిసి సమయాన్ని గడిపారు. ఎస్సై శివకుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ - "విద్యార్థి దశే మనిషి జీవితానికి పునాది. ఈ కాలంలో కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగవచ్చు. ఉపాధ్యాయులు చెప్పే ప్రతి మాటను శ్రద్ధగా వింటూ, క్రమశిక్షణతో చదివితే మీరు కోరుకున్న స్థానాలకు చేరుకోగలుగుతారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, సమయాన్ని వృథా చేయకుండా కృషిచేయాలని" సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ -"ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పుడు అన్ని రకాల మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు మంచి పుస్తకాలను చదివి, మంచి స్నేహితులను ఎంచుకుంటే జీవితంలో విజయాలు సాధ్యం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు గర్వకారణంగా మారాలని, భవిష్యత్తులో దేశానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని" పిలుపునిచ్చారు. అనంతరం ఎస్ఐ శివకుమార్ ను జిల్లా ఎస్పీ శాలువతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు చింతలపల్లి మున్సిపల్ కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేయాలి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు



**మేడ్చల్-మల్కాజిగిరి, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా లో మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు గత మూడు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్. శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు.కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోవడం కష్టమై అప్పుల పాలవుతున్నారని, ఇంటి అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. కేవలం ఈ వేతనాలపై ఆధారపడే వందలాది కుటుంబాలు నిరాశలో ఉన్నాయని తెలిపారు."మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే కార్మికులు ఎలా బ్రతకాలి? ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకొని కార్మికులకు రావాల్సిన జీతాలు చెల్లించాలి. లేకపోతే మేము సమ్మెకు దిగక తప్పదు" అని శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఉండే కృష్ణ పాల్గొని కార్మికులకు సంఘీభావం ప్రకటించారు.

## నిబంధనల మేరకు అర్హత ఉన్న భూభారతి దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించాలి

కలెక్టర్ స్నేహ శబరీష్



**హన్మకొండ,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ రెవెన్యూ అధికారులను ఉద్దేశించి నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన భూభారతి దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చేపడుతున్న రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు.శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమీక్షా సమావేశంలో భూభారతి దరఖాస్తులు, ఇప్పటివరకు పరిష్కరించిన సంఖ్య, ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, 22(ఏ) కిందకు వచ్చే భూములు, సాదా బైనామా, ఫారెస్ట్, శిఖం, అసైన్డ్ భూములు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ఆర్డీవోలు, తహసీల్దార్లు వివరాలు అందించారు. మండలాల వారీగా భూభారతి దరఖాస్తులు, పరిష్కరించిన దరఖాస్తులు, ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను కలెక్టర్ పరిశీలించారు. తహసీల్దార్లు సాదా బైనామా దరఖాస్తులపై సమాచారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ భూములు, చెరువు శిఖం, అసైన్డ్ భూములపై పూర్తి స్థాయి వివరాలను తక్షణమే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, తహసీల్దారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఇందిరా మహిళా శక్తి ద్వారా పేదరిక నిర్మూలన లక్ష్యం

- మహిళల ఆర్థిక సాధికారతతోనే పేదరికానికి ముగింపు
- హైటెక్ సిటీలో విజయవంతమైన ప్రయత్నం తరహాలోనే
- హైదరాబాద్‌లో మరిన్ని ప్రాంగణాలు మహిళా సంఘాలకు కేటాయింపు
- సరస్ మేళా ప్రారంభోత్సవంలో మంత్రి సీతక్క స్పష్టీకరణ

**హైదరాబాద్,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):**

మహిళల ఆర్థిక సాధికారత ద్వారానే పేదరికానికి శాశ్వత పరిష్కారం సాధ్యమని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. హైటెక్ సిటీలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో జరిగిన సరస్ మేళాను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను స్టాల్స్‌లో స్వయంగా సందర్శించి కొనుగోలు చేశారు.సీతక్క మాట్లాడుతూ గ్రామీణ మహిళల చేతివృత్తులు, ఉత్పత్తుల ప్రదర్శన కోసం హైటెక్ సిటీ వంటి విలువైన ప్రదేశాన్ని కేటాయించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో మహిళలకు కీలక భాగస్వామ్యం కల్పించడమే తమ సంకల్పమని చెప్పారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతోందని, ఇప్పటివరకు బ్యాంకుల ద్వారా రూ. 27 వేల కోట్ల రుణాలు మహిళా సంఘాలకు అందించామని వివరించారు.

మహిళలు తీసుకున్న రుణాల్లో 98 శాతం రీపేమెంట్ చేయడం వారి క్రమశిక్షణకు నిదర్శనమని పేర్కొన్నారు. చిరు వ్యాపారాల నుండి ప్రారంభమైన మహిళా శక్తి ఇప్పుడు పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్రాజెక్టులు వంటి పెద్ద వ్యాపారాల్లోనూ అడుగుపెడుతోందని తెలిపారు. నారాయణపేట మహిళా సమాఖ్య నడుపుతున్న పెట్రోల్ బంకు ఆరు నెలల్లో రూ. 13.7 లక్షల ఆదాయం సంపాదించిందని వివరించారు.

మహిళలకు అవకాశాలు ఇస్తే వారు ఆకాశాన్నే చీల్చి అంతరిక్షంలోకి వెళ్లగలరని నిరూపించారని గుర్తుచేసిన మంత్రి, వడ్డీ వ్యాపారుల దోపిడీని అడ్డుకోవడంలో మహిళా సంఘాలు విజయవంతమయ్యాయని చెప్పారు. ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా పేదరిక నిర్మూలన ప్రధాన లక్ష్యమని, విజయవంతమైన ఈ ప్రయత్నం తరహాలోనే హైదరాబాద్‌లో మరికొన్ని ప్రాంగణాలను మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనకు కేటాయిస్తామని తెలిపారు.

ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ కోటీశ్వరురాలిగా ఎదగాలని పిలుపునిచ్చిన సీతక్క, ఈ సందర్భంగా మహిళా సంఘాలకు రుణాలు సులభంగా అందిస్తున్న పలువురు బ్యాంకర్లను సన్మానించారు.








## పాత బస్సులకే స్పెషల్ బోర్డులు తగిలించి దోపిడీ చేస్తున్నారు

- పండగ వేళ ఆర్టీసీ ఛార్జీల పెంపుపై హరీశ్ రావు తీవ్ర విమర్శ
- ప్రత్యేక బస్సుల పేరుతో 50 శాతం అదనపు వసూళ్లు సరికాదన్న హరీశ్
- ప్రయాణికులపై పెను భారం మోపడం దుర్మార్గమని వ్యాఖ్య

**హైదరాబాద్,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణలో పండుగ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపు ప్రతిపాదనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రభుత్వాన్ని విమర్శించారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల నుంచి అదనపు ఛార్జీలు వసూలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం కావడం సిగ్గుచేటని ఆయన అన్నారు. పండుగలు వస్తే ప్రజలను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ప్రత్యేక సర్వీసుల పేరుతో పల్లె వెలుగుతో సహా అన్ని బస్సుల్లో 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయడం ప్రయాణికులపై పెనుభారం మోపడమేనని ఆయన అన్నారు. ఈ చర్యతో ప్రజల పండుగ సంతోషాన్ని ప్రభుత్వం దూరం చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా ప్రజా పీడనే అని పేర్కొన్నారు. అదనంగా కొత్త బస్సులను ఏర్పాటు చేయకుండా రోజూ తిరిగే బస్సులకే 'పండుగ స్పెషల్' అని బోర్డులు తగిలించి ప్రజలను దోచుకోవడం దారుణమని హరీశ్ రావు ఆరోపించారు. పండుగ వేళ ప్రజలకు సంతోషం లేకుండా చేయడమేనా ప్రజా పాలన అంటే అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి అని నిలదీశారు. తక్షణమే ఈ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## నాపై కుట్ర జరుగుతోంది

- విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి
- తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాల ఖండన
- తాను ఎలాంటి రాజకీయ నిర్ణయం తీసుకోవడం లేదని స్పష్టీకరణ
- కొందరు కావాలనే తన ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని వ్యాఖ్య

**హైదరాబాద్,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):**



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలను తీవ్రంగా ఖండిరచారు. తాను ఎలాంటి రాజకీయ నిర్ణయం తీసుకోవడం లేదని, తనపై కొందరు ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. ఏపీలోని గుంటూరులో ఒక సామాజిక కార్యక్రమానికి హాజరైన ఆయన, శుక్రవారం ఉదయం విజయవాడలోని కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఏపీ పర్యటనకు వచ్చినప్పటి నుంచి తనపై రాజకీయంగా తప్పుడు ప్రచారం మొదలుపెట్టారని ఆయన మండిపడ్డారు. ''నేను నిన్ననే మీడియా ముందు స్పష్టత ఇచ్చాను. అయినా కొంతమంది కావాలనే నా ప్రతిష్ఠను దెబ్బతీయడానికి దుష్ప్రచారం చేస్తున్నారు. వాటిని ఎవరూ నమ్మవద్దు. నేను ఎలాంటి రాజకీయ నిర్ణయం తీసుకోవడం లేదు'' అని రాజగోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉండే కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలని, ఇరు రాష్ట్రాలు అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆయన వివరించారు.

## తెలంగాణ సెక్రటేరియట్‌పై నో ఫ్లైయింగ్ జోన్ ఆంక్షలు

**హైదరాబాద్ :** తెలంగాణ సచివాలయం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. సచివాలయంతో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో నో ఫ్లైయింగ్ జోన్ ఆంక్షలు విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సచివాలయం చుట్టూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది కాంగ్రెస్ సర్కార్. సెక్రటేరియట్‌పై, దాని చుట్టూ డ్రోన్ ఎగరవేస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. డ్రోన్లు ఎగరవేసి, గత ప్రభుత్వ కేసీఆర్ గుర్తులు అంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు పోస్టులు పెడుతున్న నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చర్యకు ఉపక్రమించినట్లు రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో చర్చ జరుగుతుంది. రేవంత్ సర్కార్‌పై నెటిజన్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఇదేనా ప్రజాపాలన అని నిలదీస్తున్నారు. గత ప్రభుత్వ అభివృద్ధిని ప్రశంసించే ప్రతి ఒక్కరిపై ఉక్కుపాదం మోపడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.



## బస్ టికెట్ల ధరల పెంపుపై టీజీఎస్ఆర్టీసీ వివరణ

- టికెట్ చార్జీలు పెరిగాయనే ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదు
- స్పెషల్ బస్సుల్లో మాత్రమే సాధారణ చార్జీలో 50 శాతం వరకు సవరణ
- తిరుగు ప్రయాణంలో ప్రయాణికుల రద్దీ ఉండకపోవడంతో ఖాళీగా ఆ బస్సులు వెళ్తుంటాయి
- స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరను సవరించుకోవాలి
- టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం

**హైదరాబాద్,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):**





పండుగల నేపథ్యంలో బస్సు టికెట్ చార్జీలను పెంచినట్లు జరుగుతున్న ప్రచారాన్ని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఖండిరచింది. టికెట్ చార్జీలు పెరిగాయనే ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేసింది. ప్రధాన పండుగల సమయాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 16 ప్రకారం తిరుగు ప్రయాణంలో ఖాళీగా వచ్చే సర్వీసులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరలను సంస్థ సవరిస్తుందని పేర్కొంది. స్పెషల్ బస్సుల్లో మాత్రమే సాధారణ చార్జీలో 50 శాతం వరకు సవరణ అమల్లో ఉంటుందని వివరించింది. టీజీఎస్ఆర్టీసీలో 2003 నుంచి ఈ పద్ధతి ఆనవాయితీగా వస్తోందని, ఇప్పుడే స్పెషల్ బస్సుల్లో కొత్తగా చార్జీలను సవరణ చేస్తున్నట్లు కొందరు దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికింది. ప్రధాన పండగలైన సంక్రాంతి, దసరా, రాఖీ పౌర్ణమి, వినాయక చవితి, ఉగాది, తదితర సమయాల్లో హైదరాబాద్ నుంచి ప్రయాణికులు ఎక్కువగా సొంతూళ్లకు వెళ్తుంటారు. ఈ సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం నడుపుతుంది. రద్దీ మేరకు హైదరాబాద్ సిటీ బస్సులను కూడా జిల్లాలకు తిప్పుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రయాణికుల రద్దీ ఉండకపోవడంతో ఖాళీగా ఆ బస్సులు వెళ్తుంటాయి. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగల సమయాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 50 శాతం వరకు టికెట్ ధరను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. ' అని టీజీఎస్ఆర్టీసీ తెలిపింది.

టీజీఎస్ఆర్టీసీలో ప్రస్తుతం 10 వేల వరకు బస్సులు సేవలందిస్తున్నాయి. పండుగ సమయాల్లో రద్దీకి అనుగుణంగా ప్రతి రోజు సగటున 500 నుంచి 1000 వరకు స్పెషల్ బస్సులను మాత్రమే సంస్థ నడుపుతుంది. ఆ స్పెషల్ బస్సుల్లో మాత్రమే జీవో ప్రకారం చార్జీల సవరణ ఉంటుంది. మిగతా రెగ్యులర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదని టీజీఎస్ఆర్టీసీ స్పష్టం చేసింది. బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ఇప్పుడు కూడా స్పెషల్ బస్సులను సంస్థ నడుపుతోందని టీజీఎస్ఆర్టీసీ తెలిపింది. రద్దీ ఎక్కువగా ఉండే ఈ నెల 20తో పాటు 27 నుంచి 30 తేదీ వరకు వరకు, అలాగే అక్టోబర్ 1, 5, 6 వ తేదీల్లో నడిచే స్పెషల్ బస్సుల్లోనే చార్జీల సవరణను సంస్థ చేయనుందని పేర్కొంది. ఆయా రోజుల్లో తిరిగే రెగ్యులర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు చేయలేదని స్పష్టం చేసింది. పండగల సమయాల్లో నడిచే అన్ని బస్సుల్లోనూ చార్జీలను సవరించారని కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని.. ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేస్తోంది.

కాగా, టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో టికెట్ల ధరల పెంపుపై తెలంగాణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పండుగల సమయాల్లో ప్రత్యేక సర్వీసులు నడిపించారని.. కానీ ఆయా బస్సుల్లో టికెట్ల ధరలను పెంచలేదని గుర్తుచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే స్పెషల్ సర్వీసుల పేరుతో దోచుకుంటున్నారని మండిపడుతున్నారు.

## అస్సాం రైఫిల్స్ కాన్వాయ్‌పై కాల్పులు..

మణిపూర్‌లో బిష్ణుపూర్ జిల్లాలో అస్సాం రైఫిల్స్ కాన్వాయ్‌పై దుండగులు మెరుపు దాడి చేశారు. కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతి చెందగా.. నలుగురు గాయపడ్డారు. రాజధాని ఇంఫాల్ శివారులో శుక్రవారం సాయంత్రం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇంఫాల్ ఎయిర్ పోర్టు నుంచి 8 కి.మీ దూరంలో ఉనన నంబోల్ సబల్ లైకై ప్రాంతంలో, ఇంఫాల్ నుంచి బిష్ణుపూర్ ప్రయాణిస్తున్న పారామిలిటరీ దళాల వాహనంపై గుర్తు తెలియని ముష్కరులు కాల్పులు జరిపినట్లు సైన్యం కూడా ధ్రువీకరించింది. ఇంఫాల్ నుంచి బిష్ణుపూర్ వైపు 33 మంది అస్సాం రైఫిల్స్ సిబ్బందితో వెళ్తున్న వాహనం లక్ష్యంగా దాడి జరిగింది. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మణిపూర్ గవర్నర్ అజయ్ భల్లా ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో మరణించిన సైనిక కుటుంబాలకు ఆయన సంతాపం తెలిపారు. ఈ ఘటనలో గాయపడ్డవారు వెంటనే కోలుకోవాలని ప్రార్థించారు. ఇలాంటి హింసాత్మక ఘటనల్ని సహించబోమని ఆయన అన్నారు. మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి ఎన్ బిరేన్ సింగ్ ఈ దాడిని ఇది రాష్ట్రానికి తగిలిన క్రూరమైన దెబ్బగా అభివర్ణించారు. ఘటన సమయంలో కాన్వాయ్‌లో మొత్తం 33 మంది సిబ్బంది ఉన్నారు. ఇద్దరు జవాన్లను కోల్పోవడం దారుణమంటూ ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. వారి ధైర్యం మరియు త్యాగం మన హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటాయి'' అని సింగ్ పేర్కొన్నారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in